రంగులతో మమ అనిపించేశారు

- మరమ్మతులు చేపట్టక మూలకు చేరిన ఆట వస్తువులు
- ఫ్లోరింగ్ శిథిలమవడంతో చిన్నారులకు గాయాలు
- అధ్వానంగా ఆల్ ఎబిలిటీ పార్కు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


• శిథిలమై నిరుపయోగంగా మారిన ఆట వస్తువులు


• పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన ఫ్లోరింగ్


• పార్కు ప్రాంగణంలో మద్యం సీసాలు

ఏయూ క్యాంపస్: క్షేత్ర స్థాయిలో చిన్నారులు ఆనందంగా ఆడుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు కేవలం రంగులు వేసి మమ అనిపించేశారు. బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ దగ్గరలో ఉన్న ఆల్ ఎబిలిటీ పార్క్‌లో సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పార్కు అధ్వానంగా మారింది. ఇక్కడ ఆడుకోవడానికి పదుల సంఖ్యలో చిన్నారులు నిత్యం వస్తుంటారు. అయితే ఇక్కడి పరికరాలకు మరమ్మతులు చేయడంపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా బీచ్‌రోడ్డు సుందరీకరణలో ఈ ప్రాంతానికి రంగులు అద్దారు. పార్క్ గోడలకు, పరిసరాలకు రంగులు వేయడంపై చూపిన శ్రద్ధ, పార్క్ నిర్వహణపై, ఆట వస్తువులకు మరమ్మతులపై పెట్టలేదు. ప్రస్తుతం ఇక్కడ కొద్దిగా ఆట వస్తువులు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. అవి కూడా మరమ్మతులతో, అతుకులతో ఉన్నాయి. నిత్యం వందలాది మంది చిన్నారులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆడుకోవడానికి ఈ పార్క్‌కి వస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ పార్క్ నిర్వహణ, ఆట వస్తువులను ఏర్పాటు చేయడంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మూలకు చేరిన ఆట వస్తువులు

పార్క్‌లో పలు ఆట వస్తువులు మూలకు చేరాయి. ఆశగా ఆడుకోవడానికి వచ్చే చిన్నారులకు వీటిని చూస్తే నిరాశే ఎదురవుతోంది. అదేవిధంగా ఫ్లోరింగ్ సైతం పలు చోట్ల దెబ్బతింది. పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో చిన్నారులు ఆటలాడుతూ పడిపోతూ గాయాల పాలవుతున్నారు. మూలకు చేరి, తుప్పు పట్టిన ఆట వస్తువులు చిన్నారులను వెక్కిరిస్తున్నాయి. పాడైన వాటికి మరమ్మతులు చేపట్టడంతోపాటు కొత్త ఆట పరికరాలు ఏర్పాటు చేస్తే చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఎక్కడ చూసినా మద్యం సీసాలే

పార్క్ పరిసరాల్లో పదుల సంఖ్యలో మద్యం సీసాలు నిత్యం దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో మద్యం ప్రియులు ఈ పార్క్ పరిసరాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. రాత్రి పూట మద్యం సేవిస్తూ సీసాలను అక్కడే వదిలేస్తున్నారు. చిన్నారులు ఆడుకునే పార్క్‌లో ఇటువంటి వాటిని కట్టడి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మద్యం ప్రియులను కట్టడి చేయకపోగా పార్క్‌లో పేరకుపోయిన మద్యం సీసాలను సైతం తొలగించడం లేదు. ఆ సీసాలు పగిలితే ఆడుకునే చిన్నారులకు గాయాలయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్టోర్ రూమ్‌ను తలపిస్తున్న ప్రాంగణం

పార్క్‌లో దెబ్బతిన్న ఆట వస్తువులు, ఇనుప గేట్లు, ఇతర వస్తువులను పార్క్‌లో ఒక ప్రాంతంలో నిల్వ చేస్తున్నారు. దీంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్క్ పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఇక్కడ ఉన్న ఓడవంటి నిర్మాణాన్ని ఆసక్తిగా చిన్నారులు తిలకిస్తూ ఫొటోలు తీసుకుంటారు. అటువంటి ప్రాంగణం మొత్తం వ్యర్థాలతో నిండిపోయి చిన్నారులు కాలు పెట్టడానికి వీలు లేకుండా పోయింది. పార్క్ వెనుక వైపు ఉండే గేటు, చుట్టూ రక్షణ కోసం నిర్మించిన ఇనుప కంచె సైతం శిథిలమైంది. దివ్యాంగులు సైతం ఈ పార్క్‌ని సందర్శించే విధంగా ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు, నిర్మాణం జరిపారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న పరిస్థితులు చిన్నారులు ఆడుకోవడానికి ఎంతమాత్రం అనుకూలంగా లేవని తల్లిదండ్రులు వాపోతున్నారు.


పార్క్ లోపల స్టోర్ రూమ్‌ను తలపిస్తున్న ప్రాంతం


• రంగులు వేసి వదిలేసిన ఆల్ ఎబిలిటీ పార్కు


• శిథిలమైన చిన్నారుల ఆట పరికరాలు


• శిథిలమైన ఆట వస్తువులు


• దెబ్బతిన్న ప్రహరీ ఇనుప కంచె

క్లుప్తంగా

ఏపీ లైవ్‌స్టాక్ అసోసియేషన్ అధ్యక్షుడికి అభినందనలు


బోనం గోవిందరాజును అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆరిలోవ: పశు సంవర్ధక శాఖలో ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ అసిస్టెంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విశాఖకు చెందిన బోనం గోవిందరాజు ఎన్నికయ్యారు. ఆయనను సోమవారం విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా గోవిందరాజు మాట్లాడుతూ ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో తమ ప్యానల్ సభ్యులు గెలుపొందారని తెలిపారు. రాష్ట్రంలో 13 జిల్లాల సభ్యులు తనను అధ్యక్షుడిగా ఎన్నుకొన్నారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం కోసం పనిచేస్తానని, సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. మూడేళ్ల కాలపరిమితి గల ఈ అధ్యక్ష పదవి తనకు రెండోసారి దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు. మూడేళ్ల క్రితం తాను మొదటి సారిగా అధ్యక్షుడిగా ఎన్నికై నట్లు తెలిపారు.

రజకవీధి కాలువలో పూడిక తీత


రజకవీధి కాలువలో పూడిక తీస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు రజకవీధి మార్గంలో కాలువ నిర్మాణానికి తవ్వి వదిలేసిన గోతుల్లో పూడిక నిండిపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు స్వచ్ఛ భారత్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుకు స్పందించిన జీవీఎంసీ అధికారులు సోమవారం పారిశుద్ధ్య సిబ్బందితో గోతిలో పూడికలు తీయించారు. త్వరగా కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ ఆదేశించారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

మద్దిలపాలెం: యువతరం నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. సోమవారం ఏయూ పరిపాలన భవనం వద్ద స్కిల్ ఇండియాలో భాగంగా నాస్కాం కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికసిత్ భారత్ సాకారం చేయడానికి యువత సహకారం అవసరమన్నారు. ఇతర దేశాలపై ఆధారపడకుండా మనం దేశీయంగా సాంకేతికతను అభివృద్ధి చేయడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, కె.సీతామాణిక్యం, జి.గిరిజాశంకర్, కె.రమాసుధ పాల్గొన్నారు.

జాలరిపేట తీరంలో నిమజ్జనాలు నిలిపేయాలి


జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందేస్తున్న సంఘం సభ్యులు

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేట తీరంలో వినాయక చవితి, దేవీ నవరాత్రుల తర్వాత విగ్రహాలు నిమజ్జన ప్రక్రియ నిలుపుదల చేయాలని ఆ గ్రామ సేవా సంఘం కోరింది. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్, నగర పోలీసు కమిషనర్‌కు సోమవారం సంఘం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ జాలరిపేట తీరాన్ని ఆనుకుని 3 వేల వరకు మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ఆయా కుటుంబాలకు చేపల వేట ఒక్కటే జీవనాధారమని... నిమజ్జనాల సమయంలో తీరం కలుషితం కావడంతో పాటు వ్యర్థాలు భారీగా పేరుకుపోతున్నాయన్నారు. దీంతో చేపల వేటకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తీరంలో బోట్లకు, మత్స్యకారులకు వ్యర్థాలు కారణంగా గాయాలవుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో జాలరిపేట తీరంలో నిమజ్జనాలు నిలిపివేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం నాయకులు పరసన్న, సత్తయ్య, గురయ్య, సతీష్, గణేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించింది

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు


కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్



మహిళకు కరపత్రం అందిస్తున్న సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్పొరేటర్ వెంకటరత్న స్వాతి

ఆరిలోవ : కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టేసి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై దృష్టి పెట్టిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం తూర్పు నియోజకవర్గంలో చురుగ్గా కొనసాగుతోంది. స్థానిక తొమ్మిది, పదమూడో వార్డులో సోమవారం ఈ కార్యక్రమాలు జరిగాయి. జీవీఎంసీ తొమ్మిదో వార్డులో నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు, వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతి, స్థానిక నాయకులతో కలిసి సంజీవినగర్‌లో గడప గడపకు వెళ్లారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పార్టీ ముద్రించిన కరపత్రాలు స్థానికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్‌ను గాలికి వదిలేసి అన్యాయంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. 2024లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి పార్టీల నాయకులు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీలిచ్చారని... అధికారం చేపట్టిన తర్వాత వాటిని గాలికి వదిలేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దాస్, వార్డు అధ్యక్షుడు నీరజ్‌కుమార్, స్థానిక నాయకులు సత్యవాణి, బూత్ కన్వీనర్లు నల్ల చిన్న అప్పారావు, భాస్కర్, కొండమ్మ, తారక్, శ్రీధర్ పాల్గొన్నారు.

- జీవీఎంసీ పదమూడో వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, స్థానిక నాయకులు కలిసి వార్డు పరిధి శివాజీనగర్‌లో గడప గడపకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోందని ప్రజలకు వివరించారు. వార్డు పరిశీలకుడు శ్రీనివాస్, బేత దుర్గారావు, సంపంగి వాసు, బంగార్రాజు, పోలరావు, అప్పలనాయుడు, కాకర గోవింద్ పాల్గొన్నారు.

బాబు మోసాలపై చైతన్యం తీసుకురావాలి

మద్దిలపాలెం: కల్లబొల్లి కబుర్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని... ఆ దిశగా కార్యకర్తంలా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీ 244వ నంబరు బూత్ పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించి కరపత్రాలు అందించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలో విద్యా వ్యవస్థను సర్వనాశనం చేయడమే కాకుండా, కార్పొరేట్ విద్యా సంస్థలకు అధిక ప్రాధాన్యమిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో వార్డు మహిళా విభాగం అధ్యక్షురాలు పోలరత్నం, బూత్ కన్వీనర్ వేణుగోపాల్ రెడ్డి, పులగం శ్రీనివాస రెడ్డి, పిలక మధుసూదన్ రెడ్డి, వెంకటలక్ష్మి, కొంగరాని రాంబాబు, కందిమల్ల రాజశేఖర్, మీసాల ప్రదీప్, సంధ్య, పార్వతి, వేములవలస అప్పారావు, నరేష్ రెడ్డి, చింత వెంకటరావు, ఫిరోజ్, బమ్మిడి జోగారావు, అచ్చి కోటి, మంగళగిరి సత్యనారాయణ పాల్గొన్నారు.


మహిళకు కరపత్రం అందిస్తున్న మొల్లి అప్పారావు

- జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలోని 245, 252వ బూత్‌ల పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాలు వార్డు అధ్యక్షుడు బోస రమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని గడప గడపకు వెళ్లి చంద్రబాబు మోసాలు వివరించారు. కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో పులగం సూర్యనారాయణ రెడ్డి, వార్డు పరిశీలకులు బోర కుమార్ రెడ్డి, బూత్ కన్వీనర్ హనుమంతు సూర్యనారాయణ, పులగం శ్రీనివాస్ రెడ్డి, పులగం కొండారెడ్డి, కొయ్య శశికళ, నగిరెడ్ల పోలిశెట్టి, కేవీ రమణ, ఎరుసు అరుణ, బోర సూరమ్మ, బోయి రమణ రెడ్డి, గుడే శ్రీనివాసరావు, బోర రామిరెడ్డి, కారాపురెడ్డి దుర్గ, శ్రీనివాస్, పిట్ట జగదీశ్ రెడ్డి, పిలక మధుసూదన్ రెడ్డి, అచ్చి సుధీర్ రెడ్డి, సిరపు రామలక్ష్మి, పుట్ట రమణమ్మ, చిల్లా ఎల్లయ్య రెడ్డి, సాల చిన్ని, చిల్లా నారాయణరావు, గుడే శరత్ పాల్గొన్నారు.
- జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెం బూత్ నంబర్ 231 పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి గోవింద్ గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. బూత్ కన్వీనర్ అప్పలనాయుడు, మహిళా విభాగం ప్రెసిడెంట్ వంకర శశికళ, పీతల మహేష్, శ్యామ్, చంద్రరావు, నీలపు మురళి, జగదీష్, సంధ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే విద్యార్థులకు ఉన్నత స్థాయి


స్టూడెంట్స్ కౌన్సిల్ బ్యాడ్జిలు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఉపాధ్యాయులు

ఆరిలోవ: క్రమశిక్షణతో విద్యార్థులకు ఉన్నత స్థాయి లభిస్తుందని విశాఖ వ్యాలీ స్కూల్ చైర్మన్, కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్ అన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో సోమవారం ఏపీజే అబ్దుల్ కలాం రాసిన 'కలలు ఆలోచనలవుతాయి, ఆలోచనలు చర్యలుగా మారుతాయి' అనే కార్యక్రమాన్ని ఇన్వెస్టర్ వేడుక – 2025 పేరుతో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ హరేందిర ప్రసాద్ పాల్గొని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, హెచ్ఆర్ అడ్మిన్ డి.ఎస్.వర్మతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుపై పట్టుదల అవసరమన్నారు. పట్టుదల, క్రమశిక్షణ గల విద్యార్థులు రాణిస్తారన్నారు. ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. 10, 12 తరగతుల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు, నీట్, జేఈఈ మెయిన్స్‌లో టాపర్‌గా నిలిచారని తెలిపారు. అనంతరం ఎస్ఏఎఫ్‌లో జోనల్, ఐఏఎంలో బహుళ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సరయుకు, ఆసియా రోలర్ స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించిన గ్రీష్మాకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. దీంతోపాటు విద్యార్థులకు పాఠశాల స్టూడెంట్స్ కౌన్సిల్ బ్యాడ్జిలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమరవీరుల వేషధారణలో అలరించిన చిన్నారులు


అమరవీరుల వేషధారణలో చిన్నారులు

ఎంవీపీ కాలనీ: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అమరవీరులుగా నిలిచిన ప్రముఖుల వేషధారణలో శ్రీ సత్యసాయి విద్యాసంస్థల చిన్నారులు అలరించారు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీ సత్యసాయి విద్యావిహార్ యూకేజీ విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఝాన్సీ లక్ష్మీబాయి, భగత్‌సింగ్ వంటి పలువురు ముఖ్యనేతలు, అమరవీరుల వేషధారణలో సందడి చేశారు. చిన్నారులను శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఫార్మసీ కళాశాలకు పూర్వ విద్యార్థుల సహకారం

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదిగిన పూర్వ విద్యార్థులు సమాజానికి విలువైన మానవ వనరులుగా నిలుస్తున్నారని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఫార్మసీ కళాశాల 1974 – 78 బ్యాచ్ విద్యార్థుల సహకారంతో ఆ కళాశాల భవనంలో ఆధునికీకరించిన మొదటి అంతస్తును ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విశ్వవిద్యాలయంతో తమకున్న అనుబంధాన్ని కొనసాగిస్తూ పూర్వ విద్యార్థులు ఇటువంటి సహకారాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిని కలిగిస్తాయని చెప్పారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజ శంకర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు సుమారు 1.2 కోట్లతో 2 తరగతి గదులు, ప్రయోగశాల, సమావేశ మందిరం, 4 అధ్యాపకుల గదులు, కారిడార్‌ను పూర్తి స్థాయిలో ఆధునికీకరించారని తెలిపారు. పూర్వ విద్యార్థుల తరఫున ఎం.వి.స్వామి మాట్లాడుతూ సమన్వయంతో పని చేయడం ద్వారా ఇటువంటి సదుపాయాలను నేటి తరం విద్యార్థులకు అందించడం సాధ్యపడిందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు వర్చువల్ విధానంలో తమ సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం ఏయూ తరఫున పూర్వ విద్యార్థులు ఎం.వి.స్వామి, సోమేశ్వరరావును సత్కరించారు. ఏయూ రెక్టార్ ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.

• బిందెడు నీటి కోసం బారులు



బిందెడు నీటి కోసం మహిళలు బారులు తీరారు. జీవీఎంసీ ట్యాంకర్లు ఎప్పుడొస్తాయా అని ఎదురుచూసి... అవి రాగానే క్యూ కట్టాల్సి వచ్చింది. సాధారణంగా ఇలాంటి పరిస్థితిని వేసవి కాలంలో చూస్తాం... కానీ ఆరిలోవలో మాత్రం వర్షాకాలంలోనే నీటి ఎద్దడి మొదలైంది. ఓ పక్క తీవ్ర ఎండలు, మరో పక్క ముడసర్లోవ రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గిపోవడంతో ఆరిలోవలో పలుచోట్ల స్థానికులు తాగు నీటికి ఇబ్బంది పడుతున్నారు. కుళాయిలు కూడా సరిగా రాకపోవడంతో సోమవారం జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు పదమూడో వార్డు పరిధి వెర్నిదుర్గానగర్‌కు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేశారు. దీంతో వీధిలోకి వెళ్లిన ట్యాంకరు వద్దకు స్థానిక మహిళలు బిందెడు నీరు పట్టుకోవడం కోసం క్యూ కట్టాల్సి వచ్చింది. వేసవిలో తాగు నీటి కోసం తలెత్తిన పరిస్థితి వర్షాకాలంలో కూడా ఎదురవుతుందంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగు నీటి సమస్య లేకుండా మరిన్ని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - ఆరిలోవ

22వ వార్డులో ఆర్పీల తొలగింపుపై వివాదం


కళాభారతి పార్కులో ఏపీడీతో డ్వాక్రా సంఘాల మహిళల వాగ్వివాదం

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డులో ఆర్పీల తొలగింపు వివాదాస్పదంగా మారింది. స్థానిక కార్పొరేటర్ వార్డులో గల ఐదురుగు ఆర్పీలు ప్రభుత్వ ఉద్యోగుల భార్యలు కావడంతో వారిని తొలగించాలని ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో అధికారులు వారిలో ఇద్దరిని తొలగించారు. అయితే ఆయా ఆర్పీల పరిధిలో గల డ్వాక్రా సంఘాల మహిళలు తిరిగి వారిద్దరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జీవీఎంసీ జోన్ – 3 ఏపీడీ రాము తొలగించిన ఇద్దరి ఆర్పీల స్థానంలో కొత్త వారిని నియమించేందుకు డ్వాక్రా మహిళలతో స్థానిక కళాభారతి పార్కులో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలందరూ తొలగించిన ఇద్దరు ఆర్పీలను వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త వారిని నియమించొద్దని కోరారు. అయితే తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోలేమని ఏపీడీ స్పష్టం చేశారు. మెప్మా డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆర్పీలను తొలగించారని, ఏదైనా ఆయనతోనే చెప్పుకోవాలని సమాధానమిచ్చారు. దీంతో డ్వాక్రా మహిళలు మెప్మా డైరెక్టర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామని, అంత వరకు కొత్త ఆర్పీలను నియమించొద్దని వెళ్లిపోయారు.

మేడపై జారిపడి వ్యక్తి మృతి

బీచ్‌రోడ్డు: మేడపై ఆరవేసిన దుస్తులు తీయడానికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాళ్లు జారి కిందపడిపోవడంతో మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లాకు చెందిన అప్పలనర్సింహరాజు (65) రామ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం మేడపై ఆరేసిన దుస్తులు తీసేందుకు వెళ్లి కాళ్లు జారడంతో కింద పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

మనోవికాసంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

మద్దిలపాలెం : మనో వికాసంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాకారమవుతుందని విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ మీగడ రామలింగ స్వామి అన్నారు. డాక్టర్ వి.ఎస్.క్రిష్ణా కళాశాలలో సోమవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మనోవికాసంపై ఆయన చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా భాష ఎలా ఉండాలి... భావ ప్రకటన ఎలా చేయాలి... స్పష్టంగా ఎలా మాట్లాడాలి... స్నేహం, ప్రేమ, భక్తి, దేశభక్తి విలువలపై వివరించారు. లక్ష్య సాధనతో సాగే విద్య ఉత్తమ ఫలితాలు ఇస్తుందని పేర్కొన్నారు. అనంతరం రామలింగస్వామిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ సత్కరించారు.